క్లుప్తంగా

శాకంబరేశ్వరీదేవిగా అమ్మవారు



గుడివాడ టౌన్: స్థానిక నీలామహల్ రోడ్‌లోని శ్రీ విజయదుర్గ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని శుక్రవారం శాకంబరేశ్వరీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శనానికి ఉంచారు. ఆషాఢ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారిని శాకంబరేశ్వరీదేవిగా అలంకరించినట్లు ఆలయ ఈఓ శిరీష తెలిపారు. వివిధ రకాల కూరగాయలు, పండ్లు, ఆకులతో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆమె పేర్కొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నట్లు పేర్కొన్నారు.

హోమశాల ప్రారంభం



గుడివాడ టౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్‌లోని శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానంలో నూతనంగా నిర్మించిన యాగ, యజ్ఞశాలలను శుక్రవారం ప్రారంభించారు. గుడివాడ పట్టణ వైదిక స్మార్త పురోహితుల సంఘం ఆధ్వర్యంలో రూ. 1.25 లక్షలతో నిర్మించిన యాగ, యజ్ఞశాలలు శనివారం నుంచి వినియోగంలోకి వస్తాయని నిర్వాహకులు తెలిపారు. భీమేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధి పనుల్లో భాగంగా ఈ యాగశాల నిర్మాణం పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం తెలిపారు. కార్యక్రమంలో పురోహితులు భైరవబొట్ల విజయ్‌కుమార్, దేవుళ్లపల్లి శ్రీనివాసశాస్త్రి, దేవరకొండ షణ్ముఖశర్మ, బొర్రా సుబ్రహ్మణ్యం, మాజీ పాలక మండలి సభ్యులు రమణ, జోగా సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

అమ్మవారికి సారె సమర్పణ



గుడివాడ టౌన్: స్థానిక గౌరీశంకరపురంలో వేంచేసియున్న గౌరీశంకర స్వామి దేవస్థానంలో అమ్మవారికి భక్తులు శుక్రవారం ఆషాఢ సారె సమర్పించారు. ఆషాఢ మాసం చివరి శుక్రవారం నేపథ్యంలో అమ్మవారికి వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, మిఠాయిలు భక్తులు సమర్పించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారికి అభిషేకాలు చేసి, మహిళలు సారె సమర్పించారని ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం తెలిపారు. అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శనం చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో వేదపండితులు లంక గిరిధర్, పాలక మండలి మాజీ సభ్యులు పాల్గొన్నారు.

గుర్రపుడెక్క తొలగింపునకు చర్యలు

తోట్లవల్లూరు: కేఈబీ కాలువలో గుర్రపుడెక్క తొలగింపునకు ఇరిగేషన్ అధికారులు చర్యలను శుక్రవారం ప్రారంభించారు. మండలంలోని గురివిందపల్లి వంతెన వద్ద కాలువలో భారీగా పేరుకుపోయిన గుర్రపుడెక్కను పొక్లెయినర్ ద్వారా తొలగిస్తున్నారు. సాగునీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతున్న గుర్రపుడెక్క తొలగింపునకు చర్యలు చేపట్టినట్లు ఇరిగేషన్ డీఈఈ రవికిరణ్, ఏఈఈ ప్రసాద్ తెలిపారు.

పోరాటయోధుడు కృష్ణమాదిగ

పమిడిముక్కల: మాదగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పోరాటయోధుడు అని ఆ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పసుమర్తి దినేష్‌బాబు పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమన్నారు. వీరంకి లాకులో శుక్రవారం ఎమ్మార్పీఎస్, అఖిల పక్ష నాయకుల కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, ఎమ్మార్పీఎస్, కూటమి నాయకులు కొల్లూరి దినేష్, మధు, దావీదు, చంద్రపాల్, సిల్వీబాబు, కోటేశ్వరరావు, నాగార్జున, మహేష్, బుజ్జి, రమేష్, భాగయ్య, ముత్తయ్య పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ మాట నిలబెట్టుకున్నారు

కైకలూరు: ఎస్సీ, ఎస్టీ ఉప వర్గీకరణపై ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు కట్టా వీర రాఘవులు అన్నారు. వరహాపట్నంలో ప్రధాని చిత్ర పటానికి దళిత నాయకులతో కలిసి శుక్రవారం పాలాభిషేకం చేశారు. ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి ఏసుపాదం, బీజేపీ నాయకుడు పామర్తి రాంబాబు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



పామర్రు మండలం కొమరవోలులో తల్లిపాల విశిష్టతను వివరిస్తున్న సీడీపీఓ భానుశ్రీ



మండవల్లిలో తల్లిపాల వారోత్సవాల అవగాహన ర్యాలీ

కొమరవోలు(పామర్రు): తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని, వాటిని నవజాత శిశువు పుట్టిన అరగంటలోపుగా పట్టించాలని పామర్రు ఐసీడీఎస్ సీడీపీఓ వీ భానుశ్రీ పేర్కొన్నారు. మండలంలోని కొమరవోలు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముర్రుపాలను పట్టించడం వలన చిన్నారుల్లో వ్యాధినిరోధక శక్తి పెంపొందుతుందన్నారు. కొమరవోలు సర్పంచ్ దిరిశం రత్నకుమారి, సీహెచ్ కృష్ణ సుమన్య, సూపర్‌వైజర్ విజయకుమారి పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: తల్లి పాలు బిడ్డకు శ్రేష్టకరమైనవని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ నాగమల్లీశ్వరి పేర్కొన్నారు. మండలంలోని కుమ్మమూరు–2 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం శుక్రవారం జరిగింది. తల్లి పాల విశిష్టతను నాగమల్లీశ్వరి వివరించారు.

వానపాములలో..

వానపాముల(పెదపారుపూడి): పుట్టిన బిడ్డకు తల్లి పాలు శ్రేయస్కరమని వెంట్రప్రగడ సూపర్‌వైజర్ ఎం. శివనాగమణి అన్నారు. మండలంలోని వానపాముల అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పాతూరి రమేష్ పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: పుట్టిన బిడ్డకు అర గంట లోపు అందించే ముర్రిపాలు మొదటి టీకాగా పని చేస్తాయని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం.లావణ్య చెప్పారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా కైకలూరు 12వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వైద్య సిబ్బంది శ్రీనివాస్, తాతారావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని బొమ్మినంపాడుతో పాటు పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. సూపర్‌వైజర్ ప్రసన్న, బొమ్మినంపాడు ఎంపీటీసీ సభ్యురాలు అరుణకుమారి పాల్గొన్నారు.



తోట్లవల్లూరు మండలం కుమ్మమూరులో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

మండవల్లిలో..

మండవల్లి: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని కైకలూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ దీప్తి పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండవల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ సీహెచ్ వెంకటనాగలక్ష్మి ఆధ్వర్యంలో తల్లి పాల ఆవశ్యకతపై సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీనారాయణ

పెదపారుపూడి: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని గుడివాడ సివిల్ కోర్టు సీనియర్ జడ్జి బి.లక్ష్మీనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్లో శుక్రవారం రాత్రి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 1930 సంవత్సరంలో హాస్టళ్ల ప్రారంభించినట్లు తెలిపారు. విద్యార్థులు సంఘ సేవ చేసేందుకు ముందుకు రావాలన్నారు. అనంతరం హాస్టల్లోని గదుల్లో ఉన్న వసతులు, మరుగుదొడ్లు, రికార్డులు పరిశీలించారు. హాస్టల్ వార్డెన్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

‘ఎస్సీ వర్గీకరణ తీర్పు సవాల్‌కు సిద్ధమవుదాం’

గుడివాడ టౌన్: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు గుడివాడ మాలల ఐక్యవేదిక నాయకులు తెలిపారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ఆదిమాంధ్ర సంఘం, మాల మహానాడు ఇతర మాల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. గురువారం ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ చేసేందుకు రాష్ట్రాలకు అధికారం ఇస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధం అన్నారు. దీనిపై అధ్యయనం చేసి సుప్రీంకోర్టులో సవాల్ చేసేందుకు ఐక్యవేదిక సిద్ధమైందని, శనివారం ఈ అంశంపై మాజీ ఎంపీ హర్షకుమార్, ఇతర నాయకుల ఆధ్వర్యంలో రాజమండ్రిలో సమాలోచన సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ వర్గీకరణను వ్యతిరేకించే ప్రతి మాల సోదరుడు, నాయకులు సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆదిమాంధ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు పొంగులేటి జయరాజు, దళిత నాయకులు పి.సురేష్, కర్రే నాని, వీరాస్వామి, శేఖర్, రత్నాకర్, స్టీవెన్సన్, పి.చంద్రశేఖర్, పోతురాజు, టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

జెడ్పీ ఉన్నత పాఠశాల తనిఖీ



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎంఈఓ డేవిడ్ రత్నరాజు

నందివాడ: నందివాడ మండలం లక్ష్మీనరసింహాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలను ఎంఈఓ డేవిడ్ రత్నరాజు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ఎంఈఓ సూచించారు. భోజనం అందించే విషయంలో లోపాలు లేకుండా చూసుకోవాలని హెచ్చరించారు. నాణ్యతాప్రమాణాలు పాటించకుంటే సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి



ఓపీ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాము

గుడివాడ టౌన్: పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రులు ఏర్పాటయ్యాయని, సేవలు సక్రమంగా ఉండాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఆయన ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం తనిఖీలు చేశారు. తొలుత ఓపీ రిజిస్టర్‌లో వివరాలు పరిశీలించారు. మందులు అందుబాటులో ఉన్నదీ లేనిదీ రోగులను అడిగి తెలుసుకున్నారు. మందులు బయట షాపులకు సిఫార్సు చేస్తున్న విషయాన్ని పరిశీలించారు. ఇటీవల ఆస్పత్రిలో వైద్య సేవలు అందక గర్భిణి మృతి చెందిన సంఘటనపై ఆరా తీశారు. ఆస్పత్రి పరిస్థితులలో సమస్యలను లిఖిత పూర్వకంగా తన దృష్టికి తేవాలని సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిరాదేవిని ఆదేశించారు.

అభివృద్ధికి రూ.23 కోట్లు మంజూరు

గుడివాడరూరల్: గుడివాడ నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ.23 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. నిధుల సద్వినియోగంపై ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ అధికారులతో శుక్రవారం టీడీపీ కార్యాలయంలోని ప్రజావేదికలో సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాధాన్యతా క్రమంలో గుడివాడరూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల పరిధిలోని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల అభివృద్ధికి పూర్తి స్థాయిలో అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్, ఉపాధిహామీ ఏపీఓ దేవానందరాజు, ఏఈలు రాధాకృష్ణ, సూరిబాబు పాల్గొన్నారు.

పమిడిముక్కల తహసీల్దార్‌గా నవీన్‌కుమార్

పమిడిముక్కల: పమిడిముక్కల తహసీల్దార్‌గా కె.నవీన్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల విధులకు పశ్చిమగోదావరి వెళ్లిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఎన్నికల ముందు మోపిదేవి తహసీల్దార్‌గా పనిచేశారు. డీటీ జయబాబు, ఆర్ఐ యేసుపాదం, మండల సర్వేయర్ మణికుమార్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

మొవ్వ తహసీల్దార్‌గా మస్తానరావు

మొవ్వ: మొవ్వ తహసీల్దార్‌గా కలిదిండి మస్తానరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కృష్ణాజిల్లాలోని ఉయ్యూరులో తహసీల్దార్‌గా పనిచేస్తూ ఎన్నికల విధుల్లో భాగంగా తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరుకు బదిలీపై వెళ్లిన ఈయన ఇటీవల బదీలల్లో మొవ్వ మండలానికి నియమితులయ్యారు. డీటీ సీహెచ్ గోపాలరావు, ఆర్ఐ విజయలక్ష్మి, జేఏ శామ్యూల్ మస్తానరావును అభినందించారు.

భాస్కరరావుకు సత్కారం

మొవ్వ: గత నెల 31వ తేదీన ఉద్యోగ విరమణ పొందిన ఏఈ వేముల వెంకట భాస్కరరావును ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, ఎంపీపీ కొండేటి ఇందిర, ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ మస్తాన రావు, సర్పంచ్ పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి

పామర్రు: జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్యను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని ఘంటసాల కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీకృష్ణ అన్నారు. స్థానిక హితమ్ స్కూల్లో వెంకయ్య జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. హితమ్ స్కూల్ ప్రిన్సిపాల్ పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో పింగళి వెంకయ్య జయంతి కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ వై.నాగమల్లేశ్వరరావు, అధికారులు జగన్‌మోహన్‌రావు, రాము, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: పింగళి వెంకయ్య జయంతి ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జగన్నాథపురంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ విద్యార్థులతో జెండావందనం చేయించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎం.శివరామకృష్ణ, డెప్యూటీ గవర్నర్ అర్జా ప్రసాదు, కోశాధికారి కె.రామకృష్ణ, కార్యదర్శి కోన రామారావు తదితరులు పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: జాతీయ జెండాను రూపొందించిన పింగళి వెంకయ్య జీవితం అందరికీ ఆదర్శనీయమని వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత అన్నారు. కాలేజీలో పింగళి జయంతి వేడుకను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చరిత్ర అధ్యాపకులు డాక్టర్ ఎం.హరిప్రసాద్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ ప్రియశిష్యుడిగా పింగళి వెంకయ్య మెలిగేవారన్నారు.

పింగళి వెంకయ్యకు భారత రత్న ప్రకటించాలి

భట్లపెనుమర్రు(మొవ్వ): జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతిని ఆయన జన్మ స్థలం అయిన మొవ్వ మండల భట్లపెనుమర్రులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా విచ్చేసి వెంకయ్య విగ్రహానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పింగళి వెంకయ్యకు భారతరత్న ప్రకటించి తగిన గౌరవం కల్పించాలన్నారు. సర్పంచ్ ఇందిర, ఈఓ ఝాన్సీ, శ్రీధర్, అశోక్ కుమార్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎస్ సాధించిన చిట్టిరాజుకు అభినందన



ఐపీఎస్ సాధించిన చిట్టిరాజును అభినందిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ

కైకలూరు: శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు కుమారుడు చిట్టిరాజు ఐపీఎస్ అర్హత సాధించారు. శుక్రవారం భీమవరంలో ఆయన నివాసానికి ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణ వెళ్లి పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం రాజకీయ అంశాలపై మోషన్‌రాజు, జయమంగళ చర్చించుకున్నారు. అభినందన తెలిపిన వారిలో ఎమ్మెల్సీలు కొరు శ్రీనివాస్, వంక రవీంద్రనాథ్, పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక భావనను అలవర్చుకోవాలి



అన్నాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

పామర్రు: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావనను అలవర్చుకోవాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పేర్కొన్నారు. స్థానిక విజయవాడ రోడ్డులోని అంకమ్మ తల్లి ఆలయంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా రేణుకా పరమేశ్వరునికి శుక్రవారం ఎమ్మెల్యే అన్నాభిషేకం చేశారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా తెలుగు రైతు సంఘం ఉపాధ్యక్షుడు వల్లూరిపల్లి గణేష్ దంపతులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు వరదా అప్పారావు, కోటి పాండురంగారావు, వెన్నా కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

■ **మోదీ వలనే ఎస్సీ వర్గీకరణ**

గుడివాడ టౌన్: ఎస్సీ వర్గీకరణ ప్రధాని నరేంద్ర మోదీ వలనే సాధ్యమైందని బీజేపీ కిసాన్ మోర్చ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు డి.శివాజి అన్నారు. శుక్రవారం స్థానిక నాగవరప్పాడులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి అంగడాల సతీష్, పట్టణ అధ్యక్షుడు ఎర్రపోతు అర్జున్, నందివాడ అధ్యక్షుడు వి. రామ్‌ప్రసాద్, పిట్టా మురళీకృష్ణ, ఎం. మోహన్, పి. రామకృష్ణ, వేల్పుల నాగబాబు పాల్గొన్నారు.

■ **రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ‘క్లీన్ అండ్ గ్రీన్’**

గుడివాడ టౌన్: స్థానిక ఆరో వార్డు ఎన్టీఆర్ కాలనీలో శుక్రవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించినట్లు రోటరీ క్లబ్ క్లబ్ అధ్యక్షుడు టీఎస్ రాజశేఖర్ తెలిపారు. ఎన్టీఆర్ కాలనీ మెయిన్ రోడ్డు నుంచి శ్మశానం రోడ్డు వరకు గల అంతర్గత రోడ్లు పురపాలక సంఘ కార్మికులతో కలిసి శుభ్రపర్చినట్లు పేర్కొన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించడం, డ్రెయిన్లలో పూడిక తీయడం, ఖాళీ స్థలాల్లో చెత్త తొలగించడం తదితర క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలుగా కొనసాగిస్తున్నామన్నారు. క్లబ్ పూర్వ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యేశ్వరరావు, వై.రెడ్డయ్య చౌదరి, ఎం.రమణమూర్తి, జి.నరేష్, క్లబ్ కార్యదర్శి జి.కిరణ్‌బాబు, సభ్యులు పాల్గొన్నారు.

■ **బ్యాంకు మేనేజర్లకు కౌలు రైతు కార్డుల అందజేత**

మండవల్లి: మండలంలోని లింగాల ఎస్‌జీబీ బ్యాంక్, మండవల్లి కేడీసీసీ బ్యాంక్‌లలో కౌలు రైతు కార్డుల జాబితాను శుక్రవారం రైతులతో కలిసి ఆయా బ్యాంక్ మేనేజర్లకు అందజేసినట్లు సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణి, వ్యవసాయాధికారి ఎస్కే జరీనా ఒక ప్రకటనలో తెలిపారు. కౌలు రైతులకు రుణాలు త్వరితగతిన అందించాలని కోరినట్లు పేర్కొన్నారు. కాగా లింగాలలో వరి పొలాలను వ్యవసాయాధికారులు పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. వీఏఏలు వర్మ, గోపాల్, సుభానీ పాల్గొన్నారు.

■ **కౌలు రైతులకు రుణాలు అందించాలి**

ముదినేపల్లి రూరల్: మండలంలో గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులకు వెంటనే వ్యవసాయ రుణాలు మంజూరు చేయాలని మండవల్లి సబ్ డివిజన్ ఏడీఏ జి.వెంకటమణి మండల వ్యవసాయాధికారి బి.వేణు మాధవ్ కోరారు. ముదినేపల్లి ఎస్‌బీఐ, కేడీసీసీ బ్యాంకు మేనేజర్లను శుక్రవారం కలిసి కౌలు రైతుల జాబితాను అందజేశారు.

■ **ఎస్సీ వర్గీకరణ నిర్ణయం పునరాలోచించాలి**

కైకలూరు: ఎస్సీ వర్గీకరణ నిర్ణయంతో మాలలకు నష్టం జరుగుతుందని దీనిపై పునరాలోచన చేయాలని పలువురు మాల వర్గీయులు డిమాండ్ చేశారు. కలిదిండి వ్యవసాయ మార్కెట్ యార్డులో మాల నాయకులు పార్టీలకతీతంగా శుక్రవారం సమావేశమయ్యారు. వర్గీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శనివారం కలిదిండిలో మాల వర్గీయులు ర్యాలీ చేస్తామన్నారు. నాయకులు మద్దిరాల జోగిబాబు, పండు జాన్‌రాజు, కుర్రేళ్ల ఏడుకొండలు, పాతపాటి శాంతరాజు, బళ్ల రాజు పాల్గొన్నారు.

■ **ఘనంగా ప్రఫుల్ల చంద్రరే జయంతి**

కైకలూరు: ఫాదర్ ఆఫ్ ఇండియన్ కెమిస్ట్రీగా పేరుగాంచిన ఆచార్య ప్రఫుల్ల చంద్ర రే జయంతి వేడుకలు శుక్రవారం కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఘనంగా నిర్వహించారు. భౌతిక, రసాయనిక శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత, వైస్ ప్రిన్సిపాల్ డి.ఉదయప్రకాష్, అధ్యాపకులు ఆర్.జాలబాబు, కె.రమేష్, పి.పాల్ దివాకర్, ఇమ్మానియేలు పాల్గొన్నారు.

■ **అమ్మవారికి ఆషాఢ సారె**

ముదినేపల్లి రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గల కనకదుర్గ ఆలయంలో అమ్మవారికి భక్తులు ఆషాఢ మాస సారెను శుక్రవారం సమర్పించారు. కైకలూరు రోడ్డులోని భక్తాంజనేయస్వామి ఆలయం నుంచి పలువురు మహిళా భక్తులు ఊరేగింపుగా తరలి వెళ్లి అమ్మవారికి సారెను సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు శొంఠి మాధవరావు, పామర్తి వీర వెంకట సత్యనారాయణ, మరడాని సత్యనారాయణ, సాక్షి సాయిబాబ దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా సారెను సమర్పించారు.

■ **పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలి**

గుడివాడరూరల్: పశువుల్లో వచ్చే వ్యాధులపై పశు పోషకులు అప్రమత్తంగా ఉండాలని గుడ్లవల్లేరు పశు ఉప సంచాలకులు డాక్టర్ సి.శ్రీనివాస్ అన్నారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకంలో భాగంగా మండలంలోని లింగవరంలో శుక్రవారం ఉచిత పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. 43 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ పశు పోషకులు ఎప్పటికప్పుడు పశువుల్లో వచ్చే వ్యాధులను గుర్తించి సకాలంలో పశు వైద్యశాలలకు తీసుకొచ్చి చికిత్స చేయించుకోవాలన్నారు. గన్నవరం పశువైద్యశాల కార్య నిర్వహణ అధికారి డాక్టర్ హరిత పశువులకు వచ్చే గర్భకోశ వ్యాధి గురించి వివరించి నివారణ చర్యలను రైతులకు తెలిపారు. సహాయ సంచాలకులు డాక్టర్ లక్ష్మీనారాయణ, పశు వైద్యులు డాక్టర్ హనుమంతరావు, వేణు, చింతయ్యలు వైద్య సేవలు అందించారు. గ్రామ పెద్దలు చిరంజీవిరెడ్డి, శివరామకృష్ణ, ఏసుపాదం, గోపాలస్వామి, తారకరామారావు, లోకేశ్వరరావు పాల్గొన్నారు.

■ **శ్రీనివాస్ సేవలు మరువలేనివి**

గుడ్లవల్లేరు: మండలానికి, మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా డి.శ్రీనివాస్ అందించిన సేవలు మరువలేనివని ఎంపీడీఓ డి.కృష్ణవేణి అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన శ్రీనివాస్ దంపతులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఎంపీపీ కొడాలి సురేష్, ఈఓపీఆర్డీ వి.దిలీప్‌కుమార్, మండల పరిషత్ సీనియర్, జూనియర్ అసిస్టెంట్స్ రాణి, బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

■ **ఉప్పలపాటి లేని లోటు తీరనిది**

పామర్రు: సమాజానికి మంచి హితవు పలికే చలన చిత్రాలను అందించిన ప్రముఖ సినిమా నిర్మాత, హీరో కృష్ణ బావ ఉప్పలపాటి సూర్యనారాయణ బాబు మృతి సినిమా రంగానికి తీరని లోటు అని పామర్రు కళా పరిషత్ అధ్యక్షుడు నూతనలపాటి త్రివిక్రమరావు పేర్కొన్నారు. ఇటీవల మృతి చెందిన పామర్రు మండలం రిమ్మనపూడి వాసి ఉప్పలపాటికి కళాపరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్టీఆర్ స్టూడియో వద్ద సంతాప సభను నిర్వహించారు. కళా పరిషత్ గౌరవాధ్యక్షుడు పీఎంఎస్ ప్రసాద్, డైరెక్టర్లు వెంకటేశ్వర ప్రసాద్, రామారావు, నర్సింహారావు, దుర్గారావు, ధనుష్ పాల్గొన్నారు.

■ **శాకంబరీ దేవిగా రాజ్యలక్ష్మి అమ్మవారు**

పామర్రు: స్థానిక రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామి ఆలయంలోని రాజ్యలక్ష్మి అమ్మవారిని ఆషాఢ మాసం శుక్రవారం సందర్భంగా శాకంబరీ దేవిగా అలంకరించారు. ప్రముఖ వ్యాపార వేత్త పువ్వాడ శ్రీనివాసరావు దంపతుల సౌజన్యంతో ఈ అలంకారం నిర్వహించారు. ఆలయంలో పూజలను అర్చకులు ఆర్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించామని మేనేజర్ కందుల వెంకటరెడ్డి పేర్కొన్నారు.

■ **గుడివాడరూరల్ సీఐగా సోమేశ్వరరావు**

గుడివాడరూరల్: గుడివాడరూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన సీఐ కె.ఏసుబాబును అధికారులు వీఆర్‌కు పంపారు. మచిలీపట్నం పీసీఆర్‌లో పనిచేస్తున్న సోమేశ్వరరావు బదిలీల్లో భాగంగా గుడివాడరూరల్ సీఐగా వచ్చారు.

■ **గుడివాడటూటౌన్ సీఐగాపెద్దిరాజు**

గుడివాడ టూటౌన్ సీఐగా వి.పెద్దిరాజును నియమించారు. గన్నవరం ట్రాఫిక్–1 సీఐగా విధులు నిర్వహిస్తున్న పెద్దిరాజు బదిలీల్లో భాగంగా గుడివాడ టూటౌన్ సీఐగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇక్కడ పని చేసిన ఎం.నాగదుర్గారావును అధికారులు ఏలూరు వీఆర్‌కు పంపారు.